పాతబస్తీ.. కొత్త హంగులు!

- కాలనీల్లో త్వరలోనే తీరనున్న సమస్యలు
- సీసీ రోడ్లు, డ్రైన్లు, పైపులైన్ల ఆధునికీకరణకు చర్యలు
- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ చొరవతో సీఎండీఎఫ్ కింద రూ.2 కోట్లు మంజూరు
- పరిపాలన అనుమతులు జారీ



ఉస్మానియా కళాశాల నుంచి పాతబస్తీ ఏరియాకు వెళ్లే రహదారి

కర్నూలు (టౌన్): కర్నూలు పట్టణంలోని పాతబస్తీ వాసులకు ఊరట లభించనుంది. ఈ ప్రాంతంలో అత్యధికంగా జనాభా నివసిస్తోంది. ఇందులో మైనారీలే ఎక్కువ మంది ఉన్నారు. గత పాలకులు అభివృద్ధిని విస్మరించారు. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి పాతబస్తీలోని ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఆయా కాలనీల్లో ఇరుకు సందులు, పురాతన డ్రైన్లు, విస్తరించని రోడ్లతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తో పాటు రెండేళ్ల క్రితం వచ్చిన నగరపాలక సంస్థకు చెందిన కార్పొరేటర్లు నిత్యం పాతబస్తీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే రహదారుల విస్తరణతో పాటు పాతబస్టాండ్, కొండారెడ్డి బురుజు వద్ద రూ.2 కోట్లు వెచ్చించి వివిధ పనులు చేస్తున్నారు. కొండారెడ్డి బురుజును పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నారు.

ఆయా ప్రాంతాల్లో పనుల గుర్తింపు

సీఎండీఎఫ్ (ముఖ్యమంత్రి డెవలప్‌మెంటు ఫండ్) కింద ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పాతబస్తీతో పాటు నియోజవర్గం పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించుకున్నారు. ఈ నిధులతో చాలాకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే ఆయా ప్రాంతాలను, చేపట్టాల్సిన పనులను గుర్తించారు. సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, పైపులైన్ల ఆధునికీకరణకు అంచనాలు రూపొందించారు. నిధులకు సంబంధించి ఇప్పటికే జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. దీంతో త్వరలోనే ప్రగతి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం

పాతబస్తీలో చేపట్టనున్న పనులు :

- నగరంలోని పాతబస్తీ ఏరియా పరిధిలో ఉన్న 10వ వార్డు కుబుసూరత్ మసీదు వద్ద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ ఏర్పాటు
- 10 వార్డు పరిధిలో చాకలివీధిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణం. అదేవ వార్డు పరిధిలోని గాలిగేరిలో రూ.30 లక్షలు వెచ్చించి 210 ఎంఎం హెచ్‌డీ పైపులైన్ ఏర్పాటు.
- 11వ వార్డు పరిధిలోని ఇంటి నంబర్ 15/86బి నుంచి ఇంటి నంబర్ 15/90బి, అలాగే 15/107 వరకు రూ.10 లక్షలతో సీసీ డ్రైయిన్ ఏర్పాటు
- ఇదే వార్డులో ఇంటి నంబర్ 15/70 నుంచి 16/87 వరకు రూ.20 లక్షలతో సీసీ డ్రైయిన్ల నిర్మాణం
- 11వ వార్డులోనే ఇంటి నంబర్ 15/ 127 నుంచి 15/142-143 వరకు రూ.10 లక్షలతో సీసీ డ్రైయిన్ ఏర్పాటు. అదే వార్డులోనే ఇంటి నంబర్ 16/125 నుంచి 16/164 వరకు రూ.20 లక్షలు వెచ్చించి 110 ఎంఎం మరియు 160 ఎంఎం సామర్థ్యం కలిగిన హెచ్‌డీ పైపులైన్, బూస్టర్ పంపుసెట్ పనులు చేపట్టనున్నారు.
- 47వ వార్డు పరిధిలోని ధర్మపేటలో ఉన్న ఎస్సీ కాలనీలో ఇంటి నంబర్ 40/582-23 నుంచి మంజునాథ్ ఎలక్ట్రికల్స్, సూర్య టవర్స్, చల్లా కాంపౌండ్ వరకు రూ.34.16 లక్షలతో నూతనంగా సీసీ డ్రైయిన్ నిర్మాణం
- 25వ వార్డు పరిధిలోని టాగూరు నగర్‌లో డోర్ నంబర్ 50/751 నుంచి 50/753 వరకు రూ.40 లక్షలతో 450 ఎంఎం సామర్థ్యం కలిగిన సీసీ డ్రైయిన్ నిర్మాణం
- 2వ వార్డు వాసవీ కళాశాల సమీపంలో రూ.4.78 లక్షలతో సీసీ డ్రైయిన్ నిర్మాణం చేపట్టనున్నారు.
- బుధవారపేటలోని ఎస్సీ కాలనీలో రూ.16 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైయిన్ పనులు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



కర్నూలు నగరపాలక సంస్థకు జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు సీఎండీఎఫ్ నిధులు రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటికే పనులను గుర్తించాం. పాతబస్తీలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, సచివాలయాల్లో వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని పనులను త్వరలోనే చేపడతాం. అలాగే పాతబస్టాండ్ నుంచి పెద్దమార్కెట్ వరకు రహదారుల విస్తరణకు రూ.3 కోట్లు, వ్యాపారులకు నష్టపరిహారం కింద రూ.3 కోట్లు, ఉస్మానియా కళాశాల రహదారుల విస్తరణలో నష్ట పరిహారం కింద రూ.4.50 కోట్లు విడుదల కావాల్సి ఉంది. - షాకీర్ హుస్సేన్, మున్సిపల్ ఇంజినీర్, నగరపాలక సంస్థ

గత పాలకులు పట్టించుకోలేదు



పాతబస్తీ అభివృద్ధిని గతంలోని పాలకులు పట్టించుకోలేదు. దీంతో కాలనీల్లో నెలకొన్న సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పాతబస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. సీఎండీఎఫ్ కింద రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించడం సంతోషంగా ఉంది. అలాగే ఉస్మానియా కళాశాల నుంచి బుధవారపేటకు వెళ్లే రహదారిని సైతం విస్తరించే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. త్వరలోనే చాలా వరకు సమస్యలు పరిష్కారం అవుతాయి.
- షేక్ యూనస్‌బాషా, 10వ వార్డు కార్పొరేటర్

క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసం సందర్భంగా స్థానిక జొహరాపురంలోని రయ్యాన్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి మసీద్ పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అక్బర్ అలీ, భాస్కర్ చందు, సూర్యమోహన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కర్నూలు: కర్నూలు-డోన్ 44వ నంబర్ జాతీయ రహదారిపై రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన షేక్ బషీర్ బేగం (60) మృతి చెందింది. భర్త మహమ్మద్ గౌస్‌తో పాటు ఇద్దరు కొడుకులు, కోడళ్లతో కలసి కొంతకాలంగా కల్లూరులోని చెన్నమ్మ సర్కిల్ సమీపంలో నివాసముంటున్నారు. వీరు యాచక వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం యాచక వృత్తి పూర్తి చేసుకుని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న కాలనీ నుంచి రోడ్డు దాటుతుండగా హైదరాబాదు నుంచి డోన్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో షేక్ బషీర్ బేగం అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వాహన రాకపోకలకు అవాంతరం కలుగకుండా మృతదేహాన్ని వెంటనే ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

మీటర్ రీడర్స్ పనిదినాలు పెంచాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు తీసే మీటర్ రీడర్స్ పనిదినాలను పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సీజీఎం వరకుమార్, కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతిలను కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, రాజు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలు కొనసాగించాలి

కర్నూలు(రాజ్‌విహార్): కేంద్ర ప్రభుత్వం మైనార్టీలకు అందిస్తున్న ఉపకార వేతనాలను కొనసాగించాలని ఆవాజ్ కమిటీ కర్నూలు నగర అధ్యక్షుడు ఇక్బాల్ హుసేన్ కోరారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్‌ని కలసి వినతి పత్రం అందజేశారు. ముస్లింలతో పాటు క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పార్శికులకు 1వ తరగతి నుంచి 10 వరకు వేతనాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. వీటిని కొనసాగించేలా చూడాలని విన్నవించారు. ఎంపీని కలసిన వారిలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి షరీఫ్, ఇతర నాయకులు ఉన్నారు.

'దాడి చేయడం హేయం'

కర్నూలు(సెంట్రల్): బీజేపీ నేత సత్యకుమార్‌పై దాడి హేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రామస్వామి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సత్యకుమార్‌పై దాడికి నిరసన కలెక్టరేట్ ఎదుట బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అమరావతి రాజధానిగా ఉండాలని రైతులు చేస్తున్న ఉద్యమం 1200 రోజులకు చేరుకోవడంతో సంఘీభావం తెలిపి వస్తున్న సత్యకుమార్‌పై దాడి చేయడం అన్యాయమన్నారు.

'లింగనిర్ధారణ'పై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, అలియన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ కర్నూలు, అలియన్స్ క్లబ్ ఆఫ్ గాంధీ టవర్స్, వైస్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వెంకటరమణ కాలనీలో గర్భస్థ శిశు లింగనిర్ధారణ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ గవర్నర్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ మాట్లాడారు. మెల్విన్‌జోన్స్ కార్యదర్శి సి.డి.జి.గిరి, మోహన్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో తొలగించిన 107 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట తొలగించిన ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, చంద్రశేఖర్, మనోహర్ మాణిక్యం పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. తొమ్మిదో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, ప్రత్యేక అలంకరణతో దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యస్వామి సందేశమిచ్చారు. పండితులు మామిళ్లపల్లి జగన్మోహన్ శర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి జరిగింది. అదేవిధంగా స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం

కర్నూలు: కర్నూలు శివారులోని ఉల్చాల రోడ్డులో ఉన్న స్కందాన్షి ఆలివ్‌గ్రీన్ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేసి పదవీ విరమణ పొందిన రామాంజనేయులు ఫ్లాట్ నంబర్ 18లో నివాసముంటున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉన్న ఇన్వర్టర్ ఓవర్ హీట్ అయి షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న సామాన్లు కాలి బూడిదయ్యాయి. రామాంజనేయులు నిద్ర నుంచి తేరుకుని ఇంటి పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు సరఫరాను నిలుపుదల చేయించేందుకు ప్రయత్నించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కానీ అప్పటికే టీవీ, కూలర్, ఫ్రిడ్జ్‌తో పాటు ఫర్నీచర్, మూడు ఏసీలు, ఫ్యాన్లు, కిటికీలు, వంట సామగ్రి, రూ.2 లక్షల నగదు, పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు కలిపి మొత్తం సుమారు రూ.10 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు సమాచారం. అయితే సకాలంలో అగ్నిమాపక సిబ్బంది స్పందించడం వల్ల పెను ప్రమాదం తప్పింది.

విద్యుత్ టెక్నికల్ ఈఈ బదిలీ

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు సర్కిల్ టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసన్నకుమార్ బదిలీ అయ్యారు. గత ఏడాదిగా పనిచేస్తున్న ఆయనను నెల్లూరు జిల్లా నాయుడుపేట డివిజన్‌కు బదిలీ చేస్తూ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. కాగా ఇక్కడ ప్రస్తుతానికి ఎవరినీ నియమించలేదు.

వ్యాపార సమయం పెంచుకోండి

- రంజాన్ నేపథ్యంలో వ్యాపారస్తులతో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసం నేపథ్యంలో వ్యాపార సమయాన్ని పెంచుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన వ్యాపారస్తులు, మున్సిపల్, పోలీసు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు పగలంతా ఉపవాస దీక్షలు పాటిస్తారని, ఇలాంటి సమయంలో ఏదైనా షాపింగ్ చేసేందుకు సాధ్యపడదన్నారు. సాయంత్రం వేళ ఇఫ్తార్, రాత్రి తరావీ నమాజు లాంటివి ఉంటాయని, దీంతో కొనుగోళ్లకు సమయం అనుకూలించదన్నారు. ఈ నేపథ్యంలో సమయ వేళలను పెంచుకుని సహకరించాలని, దీంతో తమ వ్యాపారాలు కూడా వృద్ధి చెందుతాయని సూచించారు. హోల్‌సేల్, రీటైల్ వ్యాపారస్తులు వ్యాపార సమయం పెంచుకుంటే ఎలాంటి ఇబ్బందులకు గురిచేయరాదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ రమాదేవి, సీఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బుధవారపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల మధుబాబు ఇటీవల మరణించడంతో అతని కుటుంబానికి రూ.10 వేలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అందజేశారు. శుక్రవారం అతని ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని ఇచ్చారు. స్థానిక వార్డు కార్పొరేటర్ శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

- సమీక్షలో కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 14వ తేదీనాటికి జిల్లాలో 10,799 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదోని, ఆలూరు, కోడుమూరు, కర్నూలు అర్బన్, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ సబ్ డివిజన్ల వారీగా నిర్దేశించిన లక్ష్యాల సాధనపై ఆరా తీశారు. ఎంపీడీఓలు, హౌసింగ్ సిబ్బంది తరచూ లేఅవుట్లను సందర్శించి ఇళ్ల నిర్మాణాలు వేగం పుంజుకునేలా చూడాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఈఈ నాగరాజు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



చెక్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వీకర్‌సెక్షన్ కాలనీలో కల్లూరు అర్బన్ 36, 37, 41వ వార్డులకు చెందిన 258 పొదుపు సంఘాల మహిళలకు రూ.1.34 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు జీవనోపాధులను మెరుగు పరుచుకుని వ్యాపార వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. చెక్కుల పంపిణీ అనంతరం సీఎం చిత్ర పటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు ఆయిషా సిద్దిఖా, శ్వేతారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఎ.హనుమంతురెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంగులు, ప్రతాప్‌రెడ్డి, షరీఫ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మహిళలు

ఉద్యోగాల భర్తీకి దేశవ్యాప్త ఉద్యమాలు

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగాల భర్తీ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ అన్నారు. శుక్రవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర అధ్యక్షతన టీజీవీ కళాక్షేత్రంలో ఉద్యోగాల భర్తీపై రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. ఏటా2 కోట్ల ఉద్యోగాల భర్తీ చేస్తామన్న ప్రధాని నరేంద్ర మోదీ యువతను మోసం చేస్తున్నారని విమర్శించారు. రైల్వేలతోపాటు వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు 50 లక్షలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా జాబ్‌క్యాలెండర్‌ను విడుదల చేస్తామని చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. ఏఐవైఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు జి.ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, నాయకులు షేక్ సిద్ధిక్, సంతోష్, కారుమంచి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.తిరుమలై రామన్

ఉత్తమ సేవలతోనే గ్యాస్ట్రోలో పీజీ సీట్ల పెంపు



డాక్టర్ వెంకటరంగారెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ఉత్తమ సేవలు అందించడం వల్లే గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగంలో పీజీ సీట్ల సంఖ్య పెరిగిందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగానికి అదనంగా మరో రెండు పీజీ సీట్లను నేషనల్ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేసిన సందర్భంగా శుక్రవారం ఆ విభాగంలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగాధిపతి డాక్టర్ వెంకటరంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహం వల్లే పీజీ సీట్లు రావడం సాధ్యమైందన్నారు. దీంతో పాటు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్యులు, సిబ్బంది అవసరమైన వైద్యసేవలు అందించడంలో ఈ విభాగం మంచి పేరు సాధించిందని, ఈ విషయాన్ని ఎన్ఎంసీ సభ్యులు సైతం కొనియాడారని తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 1997లో ఉమ్మడి రాష్ట్రంలో కేవలం రెండు గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగం సీట్లు మాత్రమే ఉండేవని, అందులో ఒకటి హైదరాబాద్‌కు పోగా మిగిలిన ఒక్క దానికి ఈ రాష్ట్రం వారు పోటీ పడాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి ఒక్క కర్నూలు మెడికల్ కాలేజీలోనే నాలుగు సీట్లు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోహన్‌రెడ్డి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'తో ఇంటి వద్దకే వైద్యం

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య అన్నారు. శుక్రవారం ఆయన కర్నూలు నగరంలోని వీకర్‌సెక్షన్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో ఉన్న యుపీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల వివరాలు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్యసేవలు అందించాలన్నారు. గర్భిణులకు, కిశోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఆ వివరాలను అనీమియా మానటరింగ్ టూల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పర్లలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు.

చివరి రోజు రూ.2.37 కోట్ల పన్ను వసూళ్లు

కర్నూలు (టౌన్): 2022-2023 ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీ శుక్రవారం చివరి రోజు కావడంతో నగరపాలక సంస్థలో పన్నులు చెల్లించేందుకు నగరవాసులు క్యూకట్టారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎండవేడిమి తగలకుండా షామియానాలు ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పించారు. పన్నుదారులకు ఊరట కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాతబకాయిలకు వడ్డీ లేకుండా చెల్లించే అవకాశాన్ని కల్పించింది.దీనికి నగరవాసుల నుంచి మంచి స్పందన వచ్చింది. చివరి రోజు సాయంత్రం నాటికి కౌంటర్లలో ఆస్తి పన్ను రూ.1,11,32,865లు, అలాగే డిమాండ్ డ్రాఫ్టులు, చెక్కుల ద్వారా రూ.89,802లు, ఆన్‌లైన్ ద్వారా రూ.24,29,000, నీటి పన్ను రూ.9,91,829లు కలుపుకొని మొత్తం రూ.2.37 కోట్లు వసూలు చేసినట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ వెల్లడించారు. ఉదయం నుంచి పన్నుల చెల్లింపులను నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు పరిశీలించారు. అర్ధరాత్రి వరకు పన్ను కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు.

కౌంటర్లను పరిశీలించిన ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ నగరపాలక పన్ను కౌంటర్లను పరిశీలించారు. పన్నులు చెల్లించేందుకు పన్నుదారులు భారీగా తరలిరావడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న సిబ్బందికి సూచించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు (టౌన్): పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం స్థానిక స్వచ్ఛ భారత్ ర్యాలీలో భాగంగా ఆయా వార్డుల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. బ్యానర్లు ప్రదర్శిస్తు విద్యార్థినీ, విద్యార్థులచే పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

ఊపిరితిత్తిలో ఇరుక్కున్న ఎముక

- ఏడేళ్లుగా వ్యక్తి నరకయాతన
- బ్రాంకోస్కోపి ద్వారా తొలగించిన వైద్యులు





రోగి రామాంజనేయులుతో డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డి, బయటకు తీసిన ఎముక

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా మాంసాహారం తినేటప్పుడు పొరపాటుగా ఏదైనా ఎముక మింగితే అది అన్నవాహికలో అడ్డుపడుతుంది. కొంత మందికి ఇది ఇబ్బంది పెట్టిన వెంటనే వైద్యుల వద్దకు వెళితే తొలగిస్తారు. కానీ ఈ వ్యక్తికి మాత్రం మాంసాహారంలోని ఎముక ముక్క ఒకటి అన్నవాహిక ద్వారా కాకుండా శ్వాసనాళం గుండా కుడి ఊపిరితిత్తిలోకి చేరింది.దీంతో ఏడేళ్లుగా అతను తీవ్ర ఆయాసంతో బాధపడుతూ పలువురు వైద్యుల వద్దకు తిరుగుతూనే ఉన్నాడు. చివరకు వైద్యులకు విషయం తెలిసి బ్రాంకోస్కోపి ద్వారా దాన్ని తొలగించారు. శుక్రవారం స్థానిక ఎన్ఆర్ పేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. తుగ్గలి మండలం పెండేకల్ గ్రామానికి చెందిన రామాంజనేయులు(40) ఏడేళ్లుగా దగ్గు, ఆయాసంతో బాధపడుతున్నాడు. ఇటీవల కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ లక్ష్మణస్వామి వద్దకు వెళ్లడంతో ఆయన సీటీస్కాన్ చేయించారు. ఊపిరితిత్తుల్లో ఏదో పదార్థం ఉన్నట్లు గుర్తించి ఈఎన్‌టీ వైద్యులు తన వద్దకు రెఫర్ చేశారన్నారు. బ్రాంకోస్కోపి ద్వారా పరీక్షించగా ఎముక ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. బ్రాంకోస్కోపి పరికరం ద్వారా కుడి ఊపిరితిత్తిలోని ఆ ఎముకను ఎంతో జాగ్రత్తగా తొలగించామని, ఎముక 3 సెం.మీ వ్యాసార్థంతో మొనదేలి ఉందన్నారు. తొలగించే సమయంలో ఊపిరితిత్తికి గుచ్చుకుంటే ప్రాణాపాయస్థితి ఏర్పడుతుందన్నారు. వైద్యరంగంలో ఇది చాలా అరుదైన పరిణామమన్నారు. చికిత్సలో తనతో పాటు అనెస్తెటిస్ట్ డాక్టర్ సతీష్‌కుమార్ పాల్గొన్నట్లు చెప్పారు.

హనుమాన్ జయంతి నిర్వహణకు అనుమతించండి

కర్నూలు(సెంట్రల్): మండల కేంద్రమైన హొళగుందలో హనుమాన్ జయంతి వేడుకల నిర్వహణకు అనుమతులు మంజూరు చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం వీహెచ్‌పీ నేతలు జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. గతంలో జరిగిన సంఘటనలను బూచీగా చూపుతూ వేడుకలకు నిర్వహణను అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటోవాలా నిజాయితీ



పోలీసుల సమక్షంలో ఆటోలో మర్చిపోయిన ల్యాప్‌టాప్‌ను అప్పగిస్తున్న డ్రైవర్

కర్నూలు: ఆటోలో మర్చిపోయిన ల్యాప్‌టాప్ బ్యాగును పోలీసులకు అప్పగించి ఆటోడ్రైవర్ వెంకటేష్ నాయక్ నిజాయితీని చాటుకున్నాడు. కర్నూలు శివారులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సాయికుమార్ గురువారం స్వగ్రామం మిడుతూరుకు వెళ్లే క్రమంలో పుల్లారెడ్డి కాలేజ్ వద్ద ఆటో ఎక్కి కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ (కొత్తబస్టాండ్) వద్ద దిగాడు. తన వద్ద ఉన్నటువంటి రెండు బ్యాగుల్లో ఒకటి వెంటతీసుకుని మరొకటి ఆటోలో మర్చిపోయాడు. కొద్దిసేపు తర్వాత డ్రైవర్ బ్యాగును గమనించి కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి నిజాయితీని నిరూపించుకున్నాడు. బ్యాగులో ఉన్న ల్యాప్‌టాప్ విలువ సుమారు రూ.70 వేలు ఉంటుంది. బాధితుడు సాయికుమార్‌ను శుక్రవారం సాయంత్రం స్టేషన్‌కు పిలిపించి ల్యాప్‌టాప్‌ను అప్పగించడమే కాక ఆటోడ్రైవర్‌ను పోలీసులు అభినందించారు.

15 నుంచి జై భారత సత్యాగ్రహం

కర్నూలు(సెంట్రల్): రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీ వరకు జై భారత్ సత్యాగ్రహం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు తెలిపారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటాయన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలో రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిత్యావసరాలతోపాటు గ్యాస్ ధరలను తగ్గిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణగుప్తా, బతుకన్న, బజారన్న తదితరులు పాల్గొన్నారు.